# బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం తప్పే

- కేసీఆర్ వల్లే ఎంపీనయ్యా
- పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని



మాట్లాడుతున్న ఎంపీ వెంకటేశ్ నేతకాని

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 30 : బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం తప్పుడు నిర్ణయమేనని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని పేర్కొన్నారు. ఏప్రిల్ 29న బీజేపీలో చేరిన ఆయన మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 6న కాంగ్రెస్‌లో చేరానని, అందులో ఉన్న 2 నెలల 25 రోజులు 25 ఏళ్లుగా అనిపించిందని, అనేక అవమానాలు, అగౌరవాలు, అవహేళనలకు గురయ్యానన్నారు. ఒకప్పటి కాంగ్రెస్ పార్టీ కాదని, డబ్బున్న వారి చేతుల్లో కాంగ్రెస్ బందీ అయ్యిందని, కుటుంబ పాలనను ప్రోత్సహిస్తుందన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే, పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ తండ్రి వివేక్ అసలు లీడరే కాదని, ఆయన బిజినెస్ మ్యాన్ అని అన్నారు. మోదీ నాయకత్వంలో పనిచేయడానికే బీజేపీలో చేరానన్నారు. గ్రూప్-1 అధికారిగా, దళిత బిడ్డగా, పేదల కష్టాలు తెలిసిన వ్యక్తిగా ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో 19 ఏళ్ల సర్వీసు ఉన్నా ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. కేసీఆర్ బీ-ఫామ్ ఇవ్వడం వల్ల నేను ఎంపీ అయ్యానని, బీఆర్ఎస్‌లో ఉన్న కేంద్రీకృత విధానాల వల్ల పార్టీని వీడానన్నారు. కాంగ్రెస్ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. పెద్దపల్లిలో 30 ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నాయకులకు టికెట్లు ఇవ్వలేదని, డబ్బున్న వారికే ఇస్తున్నారని ఆరోపించారు. వందల కోట్లు ఆర్జీ టాక్స్‌పే చేసి దళితుల జీవితాలతో కాకా కుటుంబం ఆటలాడుతున్నదన్నారు. వివేక్ కొడుకుకు ఓటేయడం వల్ల ఈ ప్రాంతానికి ఒరిగేదేమీ లేదని పేర్కొన్నారు. ఆయనను గెలిపిస్తే రాహుల్ గాంధీ టాక్స్‌ను ఢిల్లీకి మోసుకెళ్లడం తప్ప మరేమీ ఉండదని విమర్శించారు.

# వంటరుచిగా లేదని భార్య హత్య

దుండిగల్, ఏప్రిల్ 30 : వంట రుచిగా లేదని భార్యను హత్య చేశాడో భర్త. మేడ్చల్ జిల్లా బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాఘాట్‌కు చెందిన రవీనాదుర్వే (26), నవీన్‌దుర్వే దంపతులు. భార్యాభర్తలు హైదరాబాద్‌కు వలస వచ్చారు. ప్రగతినగర్ ప్రగతి కన్‌స్ట్రక్షన్స్ సంస్థలో కూలీలుగా పని చేస్తూ అక్కడే గుడిసెల్లో నివసిస్తున్నారు. సోమవారం రాత్రి 9 గంటలకు మద్యం సేవించి నవీన్‌దుర్వే ఇంటికి వచ్చాడు. భార్య భోజనం వడ్డించగా, వంటరుచిగా లేదంటూ భార్యతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో క్షణికావేశంలో నవీన్‌దుర్వే అక్కడే ఉన్న ఇటుకరాయితో భార్య తలపై బలంగా కొట్టాడు. దీంతో తలపగిలి ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

# 'కవ్వంపల్లి' భేషరతుగా క్షమాపణలు చెప్పాలి

- ఎమ్మెల్యే సోదరుడు ప్రకాశ్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- మీడియా సమావేశంలో బీఅర్ఎస్ ఎస్సీసెల్ నేతల డిమాండ్

మానకొండూర్, ఏప్రిల్ 30: దళితజాతి ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి ప్రకాశ్ తక్షణమే దళిత సమాజానికి భేషరుతుగా క్షమాపణలు చెప్పాలని బీఅర్ఎస్ సెల్ మానకొండూర్ నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తాడికల్ మాజీ సర్పంచ్ గంట మహిపాల్‌తోపాటు దళిత సంఘాల నేతలు లింగాల లక్ష్మణ్, ఎనగందుల సుదర్శన్, కనుకుంట్ల అభిలాష్ మాట్లాడారు. కవ్వంపల్లి ప్రకాశ్ ఒక దళితుడై ఉండి దళితజాతి ఆడబిడ్డల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఊసరవెల్లిలా పార్టీలు మార్చే కవ్వంపల్లిదే డబ్బులకు అమ్ముడు పోయే చరిత్ర అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని దళిత ఆడబిడ్డలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి, అతని సోదరుడు ప్రకాశ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని, దళిత సోదరీమణులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం దాహం తో దళితులను కించపరిచే విధంగా ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు వంతడ్పుల సంపత్, సంగుపట్ల మల్లేశం, వడ్లూరి శంకర్, ఈస్కుల్ల అంజయ్య, సుదర్శన్, బొజ్జ కోటిలింగం, కొమ్ము సంపత్, డప్పు తిరుపతి, ఎలుక దేవయ్య పాల్గొన్నారు.

# డీసీఏ దాడులు.. ఔషధాలు సీజ్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): మా ఆయిల్ రాస్తే పక్షవాతం కూడా మటుమాయం.. మా క్యాప్సుల్స్ వాడితే ఇట్టే లావు తగ్గిపోతారు.. అంటూ తప్పుడు ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఔషధాలను డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు సీజ్ చేశారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆరుచోట్ల దాడులు చేసినట్టు డీసీఏ అధికారులు తెలిపారు. ఆయా కంపెనీలపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.














